www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 1 జూన్ 2024

5

ఏలూరు

గొడవలు, అల్లర్లకు దూరంగా ఉండండి

ఎస్ఐ కెసిహెచ్.స్వామి

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ప్రజాశక్తి - చాట్రాయి

సార్వత్రిక ఎన్నికల లెక్కింపు ఈనెల 4వ తేదీన జరుగుతుంది కాబట్టి గ్రామాలలోని ప్రజలందరూ మద్యం సేవించటం, గొడవలు, అల్లర్లు చేయటం మానుకొని ప్రశాంతంగా ఉండాలని శుక్రవారం చాట్రాయి మండలంలోని ఆరుగలను పేట గ్రామంలోని ప్రజలకు చాట్రాయి పోలీస్ స్టేషన్ ఎస్ఐ కెసిహెచ్.స్వామి సూచనలు, సలహాలు తెలియజేశారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, నలుగురు వ్యక్తులు ఎక్కడా కలిసి ఉండవద్దని, ఎన్నికల సందర్భంగా జరిగిన గొడవలలో, అల్లర్లలో కేసులో అరెస్ట్ అయితే బయటికి రావటం కష్టమవుతుందని తెలిపారు. ప్రజలందరూ ప్రశాంత వాతావరణానికి, పోలీసు సిబ్బందికి సహకరించాలని కోరారు.

ధాన్యం కొన్నారు.. డబ్బులు మరిచారు..!

- రెండు జిల్లాల్లో దాదాపు రూ.1100 కోట్లు బకాయి
- పశ్చిమలో రూ.850 కోట్లుపైనే, ఏలూరు జిల్లాలో రూ.242 కోట్లు
- ఏప్రిల్ 28 తర్వాత చిల్లిగవ్వ చెల్లిస్తే ఒట్టు
- తెచ్చిన అప్పలకు వడ్డీ తడిసిమోపెడు
- ట్రాక్టర్, కోతమిషన్, కూలీలకు డబ్బుల్విలేని దుస్థితి

'ఏలూరు రూరల్ మండలంలోని సుంకరవారితోటకు చెందిన కౌలురైతు బైరెడ్డి లక్ష్మణరావు పదెకరాల ధాన్యం మే 3, 4 తేదీల్లో విక్రయించారు. రూ.6.25 లక్షల సొమ్ము రావాల్సి ఉంది. దాదాపు నెల గడుస్తున్నా ఇప్పటి వరకూ చిల్లిగవ్వ సొమ్ము జమ కాలేదు. కోత మిషన్లకు, కూలీలకు, సాగుకు తెచ్చిన అప్పలకు సంబంధించిన ఒత్తిళ్లు భరించలేని పరిస్థితి నెలకొంది. దీంతో దిక్కుతోచని పరిస్థితుల్లో అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.'

'ఏలూరు రూరల్ మండలానికి చెందిన మరో రైతు చిన్ని పోతురాజు మే మొదటివారంలోనే 480 సారలు ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించారు. రూ.3.50 లక్షల సొమ్ము రావాల్సి ఉంది. అదిగో ఇదిగో అనడం మినహా ఒక్క రూపాయి జమకాలేదు. సాగు కోసం చేసిన అప్పల ఒత్తిడి పెరిగిపోతుంది. ఇదేం దారుణం' అంటూ ఆ రైతు గగ్గోలు పెడుతున్నాడు.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న రైతులు లక్ష్మణరావు, చిన్ని పోతురాజులే కాదు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ధాన్యం విక్రయించిన వేలాది మంది రైతుల పరిస్థితి ఇదేవిధంగా ఉంది. ధాన్యం కొన్నారు.. డబ్బులు మరిచారు అనే చందంగా పరిస్థితి తయారైంది. ధాన్యం సొమ్ము జమకాక రైతులు అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. తొలుత ధాన్యం విక్రయించిన వారం రోజుల్లోపే సొమ్ములు జమైన పరిస్థితి ఉంది. ఏప్రిల్ 28వ తేదీ తర్వాత ధాన్యం సొమ్ము జమ పూర్తిగా నిలిచిపోయింది. దీంతో రైతులు పడుతున్న కష్టాలు వర్ణాతీతం. సాగు కోసం తెచ్చిన పెట్టుబడులకు వడ్డీలు తడిసి మోపెడవుతున్నాయి. కోత మిషన్, ట్రాక్టర్ కిరాయిలు, కూలీలకు ఇచ్చేందుకు సైతం చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితి నెలకొంది. పంట చేతికొచ్చి నెలపైనే గడిచిపోవడంతో అప్పుల వాళ్ల ఒత్తిడి మరింత పెరిగిపోయింది. దీంతో ముఖ్యంగా కౌలురైతులకు ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ధాన్యం సొమ్ములు ఇవ్వండి మహాప్రభో అంటూ రైతులు వేడుకోవాల్సిన దీనస్థితి నెలకొంది. రెండు జిల్లాల్లో దాదాపు మూడు లక్షలకుపైగా ఎకరాల్లో రైతులు రబీలో వరిసాగు చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో రబీలో 7.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రణాళికలు రచించారు. ఇప్పటి వరకూ 6.34 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగింది. ఇప్పటి వరకూ రూ.400 కోట్లు వరకూ మాత్రమే రైతులకు ధాన్యం సొమ్ము జమయ్యింది. ఇంకా రూ.850 కోట్లకుపైగా ధాన్యం సొమ్ము రైతులకు అందాల్సి ఉంది. కొనుగోలు చేసిన ధాన్యంలో 40 శాతం మాత్రమే చెల్లింపులు జరిగాయి. ఇంకా 60 శాతం సొమ్ము చెల్లించాల్సి ఉంది. ధాన్యం సొమ్ము ఎప్పటికి జమ చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఏలూరు జిల్లాలో రబీలో 2.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటి వరకూ 120 రైతుభరోసా కేంద్రాల ద్వారా రెండు లక్షల 161 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగింది. 17,432 మంది రైతుల నుంచి రూ.439.01 కోట్లు విలువ చేసే ధాన్యం కొనుగోలు చేయగా ఇప్పటి వరకూ చెల్లించిన సొమ్ము కేవలం రూ.196.09 కోట్లు మాత్రమే. ఇంకా చెల్లించాల్సిన ధాన్యం సొమ్ము రూ.242.10 కోట్లు ఉంది. కొనుగోలు చేసిన ధాన్యంలో కేవలం 44 శాతం సొమ్మును మాత్రమే ఇప్పటి వరకూ చెల్లించిన పరిస్థితి ఉంది. ధాన్యం విక్రయించిన నెలరోజులు దాటిపోయినా ఇప్పటికీ సొమ్ము చెల్లించకపోవడంపై రైతుసంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులతో ఆందోళనలకు సైతం దిగుతున్నాయి. ప్రభుత్వం వెంటనే రైతులకు ధాన్యం సొమ్ము చెల్లించాలని అంతా డిమాండ్ చేస్తున్నారు. ధాన్యం సొమ్ము కోసం రైతులు పౌరసరఫరాలశాఖ అధికారులను కలవగా ప్రభుత్వం అప్పు కోసం చూస్తుందని, ఆ సొమ్ము వచ్చిన వెంటనే ఒకటి, రెండురోజుల్లో చెల్లింపులు జరుగుతాయని చెప్పి పంపిస్తున్నట్లు తెలుస్తోంది. రైతుల నుంచి తీవ్ర ఒత్తిడి వస్తుండటంతో సమాధానం చెప్పేందుకు పౌరసరఫరాలశాఖ, వ్యవసాయశాఖ అధికారులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే రైతులకు ధాన్యం సొమ్ము అందించకపోతే అన్నదాత ఇబ్బందులు వర్ణనాతీతంగా మారనున్నాయి.

అప్రకటిత కర్ఫ్యూ..!

మండుతున్న ఎండలు - జనం బెంబేలు

ప్రజాశక్తి - కలిదిండి

జిల్లాలో ఎండల తీవ్రత అనూహ్యంగా పెరగడంతో అన్ని పట్టణాలు, గ్రామాల్లో ఉదయం పది గంటల తర్వాత అప్రకటిత కర్ఫ్యూ వాతావరణం కన్పిస్తోంది. ఎండవేడిమి, ఉక్కపోతకు తాళలేక జనం విలవిల్లాడుతున్నారు. దీనికితోడు వేళాపాళా లేని విద్యుత్ కోతలతో పిల్లలు, వృద్ధులు అల్లాడిపోతున్నారు. ఎన్నికల సమయంలో 144 సెక్షన్ అమలులో ఉండగా, దానిని సూర్యుడే పైనుండి అమలు చేస్తున్నట్లుగా ఉంది పరిస్థితి. సూరీడు దెబ్బకు రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉదయం 6 గంటలకే సుర్రుమనే వెచ్చని కిరణాలతో ప్రారంభమై, క్రమేపీ బడబాగ్నిలా మారి ప్రజలను ఇంటికే పరిమితం చేస్తున్నాడు. సాయంత్రం 6 గంటల తరువాత ఎర్రని గోళంగా మారి, మళ్లీ రేపొస్తానంటూ సెలవు తీసుకుంటున్నాడు. తప్పనిసరైతే తప్ప జనం తమ ప్రయాణాలు సైతం వాయిదా వేసుకుంటున్నారు. ఇదిలా ఉంటే తినే ఆహారం కన్నా శీతల పానీయాలకే ఖర్చు పెరిగిందని పలువురు చెబుతున్నారు. కూల్‌డ్రింక్స్, కొబ్బరి నీళ్లు, వివిధ పండ్ల జ్యూస్‌లు, తాటిముంజులు, నిమ్మకాయలు వంటి వాటికి డిమాండ్ పెరిగిందనే చెప్పాలి. ఈ వారంలో గతంకంటే మూడు రెట్లు ఎక్కువ కూల్‌డ్రింక్స్ అమ్ముడుపోయాయని ఓ షాపు యజమాని తెలిపాడంటే ఎండ తీవ్రత అర్థం చేసుకోవచ్చు.

నిర్మానుష్యంగా ఉన్న కలిదిండి ప్రధాన సెంటర్

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు

స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్‌పి మేరీప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు

సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపును పటిష్టమైన భద్రతా చర్యల మధ్య పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. శుక్రవారం స్థానిక సర్ సిఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో భద్రపర్చిన ఇవిఎంల స్ట్రాంగ్‌రూమ్‌లను, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. వీరి వెంట జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, అడిషనల్ ఎస్‌పి స్వరూపరాణి, ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ, డిఆర్ఒ డి.పుష్పమణి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఒక ఎంపీ, ఏడు 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఓట్ల లెక్కింపునకు సంబంధించి ప్రతి నియోజకవర్గానికి 14 చొప్పున, పార్లమెంటుకు, అసెంబ్లీకి కలిపి 28 టేబుల్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు ఆయా నియోజకవర్గాలకు అనుగుణంగా రెండు నుంచి మూడు టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ప్రత్యేక హాలులో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో సుమారు 17 వేల పోస్టల్ బ్యాలెట్లు లెక్కించాల్సి ఉంటుందన్నారు. దీన్ని రెండు, మూడు రౌండ్లలో పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఆయా నియోజకవర్గాల ఇవిఎంల్లోని ఓట్ల లెక్కింపునకు సంబంధించి 16 నుంచి 21 రౌండ్లలో పూర్తి చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల మధ్య ఇవిఎంల్లోని ఓట్ల పూర్తి ఫలితాలు అందించేందుకు, సుమారు సాయంత్రం ఐదు గంటల్లోపు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల పూర్తి ఫలితాలు అందించే దిశగా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఇప్పటికే మూడంచెల భద్రతా ఏర్పాట్లతో నిరంతర నిఘా కొనసాగుతుందన్నారు. ప్రతి టేబుల్ వద్ద మైక్రో అబ్జర్వర్ల పరిశీలనలో ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. వీరి వెంట ఆర్‌ఒలు ఎన్ఎస్‌కె.ఖాజావలి, వై.భవానిశంకరి, కె.భాస్కర్, కె.అద్దయ్య, ఎం.ముక్కంటి ఉన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి

జిల్లాలో జూన్ 4న నిర్వహించే ఓట్లలెక్కింపు ప్రక్రియ పూర్తయ్యేవరకు సంబంధిత అధికారులు సమన్వయంతో అత్యంత సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో విధులు కేటాయించిన అధికారులు, సిబ్బంది నిర్వర్తించాల్సిన విధులపై ఎస్‌పి డి.మేరీప్రశాంతితో కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎవరికి కేటాయించిన విధులను వారు ఎటువంటి పొరపాట్లకూ తావులేకుండా అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని సంబంధిత అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. కౌంటింగ్ హాలులోకి పోటీలో ఉన్న అభ్యర్థి, లేదా వారి ప్రధాన ఏజెంట్లో ఒకరిని మాత్రమే అనుమతిస్తారన్నారు. ప్రతి కౌంటింగ్ హాలు వద్ద సిఐ స్థాయి అధికారిని పర్యవేక్షక అధికారిగా నియమించాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు పటిష్టమైన ప్లానింగ్ అమలు చేయాలన్నారు. సమీపంలోని కళ్యాణమండపాలు తదితరాలపై నిఘా ఉంచాలన్నారు. ప్రతి కౌంటింగ్ హాలు వెలుపల అగ్నిమాపక పరికరంతోపాటు ఫైర్‌మెన్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి దృష్ట్యా కౌంటింగ్ సెంటరు వద్ద రెండు షిఫ్టులతో కూడిన వైద్య బృందాలను ఏర్పాటు చేయడంతోపాటు మూడు అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా జనరేటర్లను నిర్వహించాలన్నారు. కౌంటింగ్ పూర్తయిన తర్వాత ఇవిఎంలకు సరైన రీతిలో సీళ్లు వేసి, తిరిగి వాటిని జిల్లా కేంద్రంలోని గొడౌన్‌కు తరలించే ఏర్పాటు చేయాలన్నారు. మీడియా పాయింట్ వరకు మాత్రమే ఎన్నికల కమిషన్ జారీచేసిన గుర్తింపు కార్డు కలిగిన పాత్రికేయులకు సెల్‌ఫోన్ అనుమతిస్తారన్నారు.

ఉపాధి హామీ నిర్వీర్య యత్నాలను ప్రతిఘటించాలి

ఏపి వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రతిఘటించాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి ఉపాధి కార్మికులకు పిలుపునిచ్చారు. మాదేపల్లి పంచాయతీ జాలిపూడిలో పని చేస్తున్న ఉపాధి కూలీలను రవి, సిఐటియు నాయకులు జె.గోపీ కలిసి ఉపాధి కూలీల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేసేందుకు ఏడాదికి రూ.2.50 లక్షల కోట్లు కేటాయించాల్సి ఉందని, అయితే కేవలం రూ.63 వేల కోట్లు కేటాయించి ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దేశంలో ప్రతిఒక్కరికీ ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. పని ప్రదేశంలో కూలీల పని వివరాలను ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయడానికి సెల్‌ఫోన్ సిగ్నల్స్ అందక పని దినాలను కూలీలు నష్టపోతున్నారని, ఫొటో అప్‌లోడ్ విధానాన్ని రద్దు చేయాలని, పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని, పని ప్రదేశానికి వెళ్లడానికి ప్రయాణ ఖర్చులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతాల్లో కూలీలకూ ఈ చట్టం అమలు చేయాలని కోరారు. ఏలూరు నగరంలో విలీనం చేసిన ఏడు పంచాయతీల్లోని కూలీలకు పని కల్పించాలని, లేనిపక్షంలో ఆయా పంచాయతీల్లోని కూలీలను సమీకరించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

నిడమర్రు: మండలంలోని భువనపల్లిలో ఉపాధి పని ప్రదేశాల్లో వ్యవసాయ కార్మిక సంఘం నేతలు శుక్రవారం పర్యటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల కార్యదర్శి గవర సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి కార్మికులకు రోజుకూలి రూ.600 ఇవ్వాలని, వేసవి నేపథ్యంలో తాగునీరు, మజ్జిగ, టెంట్లు, మెడికల్ కిట్లు వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు లావేటి చంద్రరావు, కోసూరు సుబ్బయ్య, అలుమోలు శ్రీను, ముత్యాల బ్రహ్మయ్య, నెల్లూరు గాంధీ తదితరులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: ఎండల్లో అల్లాడిపోతున్న ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని జీలుగుమిల్లి, కామయ్యపాలెం, బొత్తప్పగూడెం గ్రామాల్లో వ్యకాస నేతలు పర్యటించి ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. ఎన్ఎంఎంఎస్ యాప్ తెచ్చి ఎప్పుడూ లేనివిధంగా రెండు పూటలా పని పెట్టి ఉపాధి కూలీలను ఎండల్లో ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఉపాధి పనులు దగ్గర మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. టెంటు, మజ్జిగ, తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ వంటి కనీస సదుపాయాలు లేక ఉపాధి కూలీలు ఎండ తీవ్రతకు అల్లాడిపోతున్నారని తెలిపారు. గడ్డపారకు, తట్టకు డబ్బులు వచ్చేవని, సమ్మర్ అలవెన్స్ మార్చిలో 20 శాతం, ఏప్రిల్, మే, జూన్ నెలల్లో 30 నుండి 50 శాతం ఇచ్చేవారని, ఇప్పుడు ఆ అలవెన్స్ ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఒక్క పూట పని, ఉపాధి పనులు దగ్గర కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి పనులు 200 రోజులకు పెంచి, కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షం లో ఉపాధి కూలీలను ఐక్యం చేసి పెద్దఎత్తున పోరాటానికి సిద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు రాజమండ్రి దానియేలు, కారం నాగదుర్గ, జి.వెంకట్రావు పాల్గొన్నారు.

జాలిపూడిలో మాట్లాడుతున్న ఎ.రవి

జీలుగుమిల్లి మండలంలో మాట్లాడుతున్న రామకృష్ణ

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

చింతలపూడి ఆర్ఒ పి.అద్దయ్య

చిట్ చాట్

ప్రజాశక్తి - చింతలపూడి

ఈనెల 4వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అందరిలో ప్రస్తుతం కౌంటింగ్‌పై, వచ్చే ఫలితాలపై ఆసక్తి నెలకొంది. చింతలపూడి నియోజకవర్గంలో ఎటువంటి వివాదాలు లేకుండా, గొడవలకు తావులేకుండా, సమర్థవంతంగా పోలింగ్ నిర్వహించి, పోలింగ్ శాతం పెంచడానికి కృషిచేసిన ఆర్ఒ పి.అద్దయ్యతో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ గురించి ప్రజాశక్తి ముచ్చటించింది.

ప్రశ్న : నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్‌కి ఎలాంటి ఏర్పాట్లు చేశారు?

ఆర్ఒ : ఈనెల 4న జరిగే సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాము. ఏలూరులో సిఆర్ రెడ్డి ఇంజనీర్ కళాశాలలో, మెకానిక్ బ్లాకులో, రెండో ఫ్లోర్లో అన్ని ఏర్పాటు పూర్తి చేశాము. చింతలపూడి నియోజకవర్గంలో 273 పోలీస్ స్టేషన్లకు గాను లోక్ సభకు 14 టేబుల్స్, అసెంబ్లీకి 14 టేబుల్స్, పోస్టల్ బ్యాలెట్లకు రెండు టేబుల్స్, సర్వీస్ ఓటర్స్‌కి ఒక టేబుల్ ఏర్పాటు చేశాము. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్లు ఓటింగ్ లెక్కింపు ప్రక్రియ మొదలవుతుంది. 8:30కు ఇవిఎంల కౌంటింగ్ ప్రారంభమవుతుంది.

ప్రశ్న : కౌంటింగ్ ఎన్ని రౌండ్లు ఉండబోతున్నాయి? ఎప్పటిలోగా పూర్తవుతుంది?

ఆర్ఒ: చింతలపూడి నియోజకవర్గంలో 273 పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఇవిఎంలను కంట్రోల్ యూనిట్స్ ద్వారా లెక్కించడం జరుగుతుంది. మొత్తం 20 రౌండ్లు ఉంటాయి. 19 రౌండ్ల వరకు 14 టేబుల్స్ ఉంటాయని, 20 రౌండ్‌కి 7 టేబుల్స్ మాత్రమే ఉంటాయి. మొదట కొంత ఆలస్యమైనా, తరువాత రౌండ్లు త్వరగా ముగుస్తాయి. మధ్యాహ్నం మూడు గంటల కల్లా కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

ప్రశ్న : కౌంటింగ్‌కు ఎంతమంది సిబ్బందిని ఏర్పాటు చేశారు?

ఆర్ఒ : కౌంటింగ్‌కు సంబంధించి ఒక టేబుల్‌కు ముగ్గురు ఉంటారు. కౌంటింగ్ సూపర్వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ చొప్పున ముగ్గురు ఉంటారు. అలా 14 టేబుల్స్‌కు ఉంటారు.

ప్రశ్న : కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తయ్యిందా?

ఆర్ఒ : ఇప్పటికే కౌంటింగ్ సిబ్బందికి అన్ని శిక్షణలు పూర్తి చేశాము. మొదటి తారీఖున కౌంటింగ్ శిక్షణ పూర్తవుతుంది. రెండవ శిక్షణ మూడో తారీఖున మొదలవుతుంది. పోస్టల్ బ్యాలెట్‌కు శిక్షణ రెండవసారి పెడుతున్నాము. పోస్టల్ బ్యాలెట్‌కు, ఇవిఎంలకు, లెక్కింపు సిబ్బందికి ఈనెల 3వ తేదీన శిక్షణ పూర్తవుతుంది.

ప్రశ్న : ఈనెల 4న ఎలాంటి నియమ నిబంధనలు అమలులో ఉంటాయి?

ఆర్ఒ : ఈనెల 6వ తేదీ వరకూ 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. ఎవరికీ ఎటువంటి ఊరేగింపులకు, ప్రదర్శనలకు అనుమతులు లేవు. కౌంటింగ్ వద్ద చీఫ్ ఏజెన్సీకి ప్రత్యేక పాసులు అందజేశాం. పాస్‌లు ఉన్నవారు మాత్రమే అనుమతించిన ప్రాంతానికి చేరుకోగలరు. మీడియా పాయింట్‌కి ప్రత్యేకంగా ఏర్పాటు చేశాము. అక్కడి నుంచి సమాచారం ఎంచుకోవడానికి వీలుంటుంది.

ప్రశాంతంగా ముగిసిన 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లావ్యాప్తంగా పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ముగిశాయి. శుక్రవారం జరిగిన సోషల్ పరీక్షకు 4671 మంది విద్యార్థులకు 1869 మంది మాత్రమే హాజరయ్యారని, 2802 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డిఇఒ ఎస్.అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం 14 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసూ నమోదు కాలేదన్నారు.

పెన్షన్ల పంపిణీకి పటిష్ట చర్యలు

డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు

ఏలూరు: ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసిసి)ని పాటిస్తూ సామాజిక భద్రత పెన్షనర్లకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పెన్షన్ల పంపిణీ ప్రక్రియ సజావుగా సాగేలా క్షేత్రస్థాయిలో పటిష్ట చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు కోరారు. జిల్లాలో జూన్ నెలకు సంబంధించి వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, డప్పు కళాకారులు, గీత కార్మికులు, నేత కార్మికులు తదితర కేటగిరీలకు చెందిన 2,68,886 పెన్షన్లలో 2,01,377 పెన్షన్ల మొత్తం రూ.60.41 కోట్లు నగదు బదిలీ ద్వారా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా 67,497 పెన్షన్లను లబ్ధిదారులకు రూ.19.90 కోట్లు డోర్ టు డోర్ డెలివరీ విధానంలో ఇంటి వద్దే పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా సచివాలయ సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకుని జిల్లాలోని ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు డోర్ టు డోర్ పింఛను పంపిణీ కార్యక్రమాన్ని జూన్ 1వ తేదీ శనివారం ఉదయం ఆరు గంటలకే ప్రారంభించాలని విజయరాజు కోరారు.

వెంకన్నబాబు కుటుంబానికి న్యాయం చేయాలి

ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వడ్డీ వ్యాపారస్తుల వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకున్న పాకుర్ల వెంకన్న బాబు కుటుంబానికి న్యాయం చేయాలని, ఆయన మరణానికి కారణమైన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్(సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద యూనియన్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా నిర్వహించారు. వెంకన్న బాబు మరణానికి కారణమైన వారిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని ఆటో డ్రైవర్లు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ మాదేపల్లి పంచాయతీ లింగారు గూడెం గ్రామానికి చెందిన పాకుర్ల వెంకన్న బాబు(33) దళిత సామాజిక వర్గం కావడంతో వడ్డీ వ్యాపారస్తుల వేధింపులకు బలైపోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకన్న బాబుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని, ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కుటుంబ పోషణ నిమిత్తం ఆటో డ్రైవర్‌గా వెంకన్న బాబు పనిచేస్తున్నాడని, వడ్డీ వ్యాపారస్తులు చేతి అప్పుగా ఇచ్చిన డబ్బును రాబట్టుకునేందుకు అతని ఇంటి వద్ద ఉన్న ఆటోను బలవంతంగా స్వాధీనం చేసుకొని తీసుకువెళ్లడంతో మనస్థాపానికి గురైన వెంకన్న బాబు మే 30వ తేదీ గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో నిద్ర మాత్రలు తీసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వెంకన్న బాబు కుటుంబానికి న్యాయం చేయకపోతే ఆందోళనకు సైతం సిద్ధపడతామని హెచ్చరించారు. ఆటో యూనియన్ నాయకులు సిహెచ్.అమర్ కుమార్, బలరాం తదితర ఆటో డ్రైవర్లు కుటుంబ సభ్యుల్ని పరామర్శించి సంతాపాన్ని తెలియజేశారు.

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని సిఐటియు ఆధ్వర్యాన నిరసన

పలుచోట్ల డిపిఒ ఆకస్మిక తనిఖీలు

మొబైల్ కూల్ డ్రింక్స్ వ్యానుకు తాళాలు

ఏలూరు సిటీ: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని పలు ఫిర్యాదులు రావడంతో జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాధ్ పలుచోట్ల ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సాధారణ ఎన్నికల కౌంటింగ్ జరుగు ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలించి డస్ట్ బిన్నులు లేని వ్యాపారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు గ్రామాలను శుభ్రం చేస్తుంటే భాద్యత లేకుండా పరిసరాలను పాడుచేస్తారా అని వ్యాపారులకు క్లాస్ పీకారు. అదే సమయంలో సిఆర్ రెడ్డి మహిళా డిగ్రీ కాలేజీ ఎదురుగా ఉన్నా మొబైల్ వ్యాన్ కూల్ డ్రింక్స్ వ్యాపారిని నిలదీశారు. పానీయాలు తాగిన గ్లాసులను రోడ్డు పక్కన గుట్టలు గుట్టలుగా ఉండడాన్ని గమనించి సీరియస్ అయ్యారు. నిర్లక్ష్యం వహించిన మొబైల్ కూల్ డ్రింక్ వ్యానుకు తాళాలు వేయించి పరిసర ప్రాంతాలని శుభ్రపర్చాలని ఆదేశించారు.

'సజ్జల రెచ్చగొట్టే వ్యాఖ్యలు తగవు'

చింతలపూడి :ఓటమి భయంతో మతి భ్రమించి, అసహనంతో ప్రజాస్వామ్యాన్ని అపహాసం చేస్తూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం తగదని, సజ్జల రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానాలని టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షులు కొమ్మరాజు సత్యనారాయణ అన్నారు. ఒక ప్రకటనలో ఆయన తెలిపిన వివరాల ప్రకారం కౌంటింగ్ రోజున వైసిపి ఏజెంట్లను మీరు ఏ మాత్రం తగ్గకుండా తిరగబడే విధంగా సిద్ధంగా ఉండాలని, అవసరమైతే అల్లర్లని సృష్టించాలని సూచించడం సరికాదని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పును గౌరవించాలని, ఒక బాధ్యతయుతమైన ప్రభుత్వ సలహాదారుగా ఉండి చిల్లర వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. సజ్జల ఎలక్షన్ కమిషన్ పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గాను ప్రజాప్రాతినిధ్య చట్టంకింద కేసు నమోదుచేయాలని తెలిపారు.

ముగిసిన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి - చాట్రాయి

మే 24వ తేదీ నుంచి జరిగిన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నిర్వహించిన సాంఘిక శాస్త్రం పరీక్షతో ముగిశాయని మండల విద్యాశాఖ అధికారి ఎవిఎస్.బ్రహ్మాచారి తెలిపారు. శుక్రవారం నిర్వహించిన సాంఘిక శాస్త్రం పరీక్షకు 47 మంది విద్యార్థులు హాజరవవలసి ఉండగా 19 మంది విద్యార్థులు మాత్రమే పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు.

పోలవరం : మండలంలో పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు శుక్రవారం 95 మంది గైర్హాజరైనట్లు ఉపాధ్యాయులు వి.సూర్యనారాయణ మూర్తి శుక్రవారం తెలిపారు. 146 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 51 మంది మాత్రమే హాజరయ్యారని తెలిపారు. పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ముగిసినట్లు తెలిపారు.

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం గొప్ప విషయం

మండవల్లి: దాతలు ముందుకు వచ్చి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం, ఇబ్బందుల్లో ఉన్నవారికి సహాయం చేయడం చాలా గొప్ప పని అని మాజీ మంత్రివర్యులు కామినేని శ్రీనివాసరావు అన్నారు. భైరవపట్నం గ్రామానికి చెందిన నేలపాల శ్రీనివాసరావు కాలును అనారోగ్యం కారణాల వల్ల తొలగించారు. దీంతో నిమ్మగడ్డ సురేష్ కుమారుడు హేమంత్(చిన్ని) ఆర్థిక సహాయంతో అందించిన ట్రై సైకిల్‌ను ఆయన చేతుల మీదుగా శుక్రవారం బాధితునికి అందించారు. ఈ సందర్భంగా ఆయన హేమంత్‌ను అభినందించారు.

వివాహితపై అత్యాచారం: వ్యక్తిపై కేసు నమోదు

ముసునూరు:ఓ మహిళను బలాత్కారం చేయడంతో పాటు కులం పేరుతో దూషించి, చంపేస్తానని బెదిరించిన సంఘటన ముసునూరు మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముసునూరు మండలంలోని సూరేపల్లి గ్రామానికి చెందిన కొండపల్లి చెన్నారావు అనే వ్యక్తి గత వారం రోజుల క్రితం ఎస్‌సి కులానికి చెందిన మహిళతో అసభ్యకరంగా మాట్లాడుతూ నీ భర్త లేని సమయంలో నిన్ను ఇబ్బంది పెడతానని పేర్కొంటూ, నీ మీద నాకు మోజు ఉంది, నా కోరిక తీరుస్తావా లేదా, నిన్ను చంపేస్తా అంటూ బెదిరింపులు కొనసాగిస్తున్నాడన్నారు. గత ఐదు రోజుల క్రితం తాను తమ గ్రామంలోని కొత్త ఫోళు అనే ప్రదేశానికి గేదెలను పొలంలో గడ్డి మేపటానికి తోలుకొని వెళ్లగా, ఆ ప్రదేశానికి అతను తమ మోటార్ సైకిల్‌పై వచ్చి నువ్వు ఈరోజు నాకు ఒంటరిగా తగిలావు నిన్ను ఎవరూ కాపాడలేరు, నీ అంతు చూస్తా నా కోరిక తీరుస్తావా లేదా అంటూ తనని పక్కనే ఉన్న నిమ్మ తోటలోకి లాక్కుని వెళ్లి బట్టలన్నీ చిందర వందరగా చేసి, బలాత్కారం చేసి ఈ విషయం నీ భర్తకు గాని, గ్రామ పెద్దలకు గాని, మరి ఎవరికైనా తెలియజేసినట్లయితే చంపేస్తానని బెదిరించాడన్నారు. తాను ఆ మురికి బట్టలతో ఇంటికి వెళ్లగా ఆ సమయానికి ఇంట్లో ఉన్న తన భర్త ఆ విధంగా చూసి ఏమైంది అంటూ అడగగా అప్పుడు ఆ విషయం తెలియపరచగా, తన భర్త గామానికి చెందిన గ్రామ పెద్దలకు, చుట్టుపక్కల వారికి తెలియజేశారు. న్యాయం చేస్తానని చెబుతూ ఈరోజు వరకూ న్యాయం చేయకపోవడంతో వారు ముసునూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ పి.వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా విశ్వభారతి పబ్లిక్ స్కూల్

కరెస్పాండెంట్ బి.వెంకయ్య

విశ్వభారతి పబ్లిక్ స్కూల్..

ప్రజాశక్తి - మండవల్లి

విద్య అనేది వ్యాపారంలా కాకుండా ప్రతి విద్యార్థికి చదువు అందుబాటులో ఉండాలని, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలనే లక్ష్యంతో నడపబడుతున్న ఏకైక విద్యాసంస్థ విశ్వభారతి పబ్లిక్ స్కూల్ అని కరెస్పాండెంట్ బి.వెంకయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం ప్రజాశక్తితో మాట్లాడుతూ 1984లో గుమ్మల్ల రంగారావు చేత విశ్వభారతి పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. మండలంలో మొదటి పబ్లిక్ స్కూల్‌గా ఇంగ్లీష్ మీడియంలో విద్యా బోధన చేసిన ఏకైక స్కూల్ విశ్వ భారతి పబ్లిక్ స్కూల్ అని తెలిపారు. అప్పటి నుంచి విశ్వ భారతి పబ్లిక్ స్కూల్‌లో ఎల్‌కెజి నుంచి పదవ తరగతి వరకూ రాజీ పడకుండా ఇంగ్లీష్‌లో విద్యా బోధన చేయడం జరుగుతుందన్నారు. 2005 వరకూ విశ్వ భారతి పబ్లిక్ స్కూల్‌గా, 2010 నుంచి ప్రభుత్వ అనుమతులతో విశ్వభారతి హై స్కూల్‌గా మార్చడం జరిగిందని అన్నారు. నిష్ణాతులైన అంకిత భావంతో విద్యనందించే ఉపాధ్యాయులను ఎంపిక చేసి విశాలమైన తరగతి గదులలో క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నామని చెప్పారు. ప్రతి సంవత్సరం 10వ తరగతి పరీక్షల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధిస్తూనే ఉన్నారని, ప్రతి విద్యార్థి విద్య నేర్చుకోవాలి, విద్యలో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి, అనంతరం దేశం గర్వించదగ్గ విద్యార్థులుగా ఎదగాలన్నదే విశ్వభారతి ధ్యేయమన్నారు. ఇప్పటి వరకు విశ్వ భారతి హై స్కూల్‌లో విద్యనభ్యసించిన విద్యార్థులు కంప్యూటర్ సైన్స్, మెకానికల్, సాఫ్ట్‌వేర్ రంగాలలో ఇంజనీర్లుగా విద్య, వైద్యరంగంలో ఎంతో మంది ఉన్నత శిఖరాలకు చేరుకుని స్థిరపడ్డారని, విశ్వ భారతి హైస్కూల్ ఖ్యాతిని నలు దిక్కులా చాటారని వివరించారు. పాఠశాలలోని విద్యార్థుల విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించి, అబాకస్ డిజిటల్ క్లాసులు నిర్వహించడంతో పాటు ఇంగ్లీషులో అనర్గళంగా మాట్లాడే విధంగా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని అన్నారు. ఆటలతోపాటు డ్రాయింగ్, క్విజ్ వంటి పోటీలను కూడా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి సంవత్సరం విద్యార్థులకు సంస్కృతి కార్యక్రమాలను నేర్పించి, యానివర్సరీ ప్రోగ్రామ్ నిర్వహించి విద్యార్థులను ఉత్తేజపరుస్తున్నామని తెలిపారు. బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని, విద్యార్థికి విద్యలో కుటుంబ ఆర్థిక పరిస్థితి అడ్డు రాకూడదనే లక్ష్యంతో ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఫీజులో రాయితీ కూడా కల్పిస్తున్నామని అన్నారు. విద్యార్థులకు రాకపోకల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయిలో ఆటోలతో రవాణా సౌకర్యం కల్పించామని అన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ఆదరాభిమానాలతో విశ్వ భారతి హై స్కూల్ 40 వసంతాలు పూర్తిచేసుకుని 41వ విద్యా సంవత్సరంలోకి అడుగుపెడుతుందని చెప్పడానికి సంతోషంగా ఉందన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను విశ్వభారతి హై స్కూల్‌లో చేర్పించి క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు మంచి బాటలు వేయాలని ఆయన కోరారు.

విజయానికి మారుపేరు వికాస్ పబ్లిక్ స్కూల్

వికాస్ పబ్లిక్ స్కూల్ ప్రాంగణం

కరెస్పాండెంట్ పాములపాటి లలిత

ప్రజాశక్తి - చాట్రాయి

విజయానికి మారుపేరుగా వికాస్ పబ్లిక్ స్కూల్ నిలిచిందని కరెస్పాండెంట్ పి.లలిత అన్నారు. మండలకేంద్రమైన చాట్రాయిలో 2001వ సంవత్సరంలో చాట్రాయి గ్రామానికి చెందిన పాములపాటి లలిత వికాస్ పబ్లిక్ స్కూల్ విద్యాసంస్థను స్థాపించడం జరిగింది. మొదట నర్సరీ నుంచి 5వ తరగతి వరకు పాఠశాలలో తరగతులను నిర్వహించడం జరిగింది. విద్య, వినయం, విధేయత కలిగి అత్యుత్తమ ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందిస్తూ, ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యాసంస్థను అభివృద్ధి చేయటం జరిగిందని కరెస్పాండెంట్ పి.లలిత తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో శుక్రవారం ఆమె మాట్లాడుతూ విద్యార్థులను క్రమశిక్షణలో మెరుగుపరుస్తూ, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ 10వ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించి మండల ఫస్ట్‌లో నిలిచిందని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాలలో విద్యపై అవగాహనా సదస్సులు నిర్వహించి, విద్యార్థుల చదువు తీరు ఎలా ఉందో తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ, ప్రతి తరగతిలోనూ విద్యార్థుల మార్కులను తల్లిదండ్రులకు తెలియపరుస్తూ విజయపథంలో ముందుకు సాగుతున్నామని అన్నారు. ఈ సంవత్సరం 2024లో పదవ తరగతి పరీక్షలు 33 మంది రాయిగా 32 మంది ఉత్తీర్ణులైనరని వారిలో నందేటి హర్షిత 586 మార్కులు సాధించి మండలంలోని ఫస్ట్‌లో నిలిచిందని అన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థని మా పాఠశాలకు చిత్తపూరు, జనార్ధన వరం, ఆరుగొలను పేట, చాట్రాయి, పోలవరం, పోతనపల్లి, బూరుగు గూడెం గ్రామాల నుంచి విద్యార్థులు విద్య నభ్యసించుటకు రావడం జరుగుతుందని తెలి పారు. అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో ఉత్తమ బోధన, క్రమశిక్షణ అందించడం జరుగుతుందని, విద్యార్థుల సౌకర్యార్థం బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. వికాస్ పబ్లిక్ స్కూల్ పేరును వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌గా ప్రచారం చేస్తూ ఇంగ్లీష్ మీడియాన్ని విద్యార్థులకు ఈ సంవత్సరం నుంచి బోధించడం జరుగుతుందని అన్నారు.

నందేటి హర్షిత

ప్రత్యేక అవసరాలవారు వ్యాయామం చేయాలి

ప్రజాశక్తి - ముసునూరు

ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ప్రతిరోజూ వ్యాయామం చేసినట్లయితే ఆరోగ్యకరంగా ఉంటారని ఫిజియోథెరపీ ఉపాధ్యాయులు డిఎంఎల్.నారాయణ, జె.నాగమల్లేశ్వరి తెలిపారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఫిజియోథెరపీ అవసరం ఉన్న విద్యార్థులకు అంగన్వాడీ కేంద్రాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యుత్ కోతలతో జనం విలవిల

పోలవరం:మండలంలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న విద్యుత్ కోతల పట్ల గ్రామస్థులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ కోత ఉంటుందని ప్రకటించిన విద్యుత్ శాఖ అధికారులు 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా పునరుద్ధరించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు నుంచి తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం గుడ్డిగూడెం సబ్‌స్టేషన్ వరకూ 400 కేవీ విద్యుత్ వైర్ల కనెక్షన్లు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో గత కొన్ని రోజులుగా ఎండల వీవ్రత పెరిగి వడగాల్పులు, ఉక్కబోతతో గ్రామస్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. విద్యుత్ సరఫరా లేకపోవడం వల్ల పసిపిల్లలు, వృద్ధులు, రోగులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని, విద్యుత్ సరఫరాకి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్థులు కోరారు.

నేడు మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ

పోలవరం: మండలంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలల మధ్యాహ్న భోజన పథక కార్మికులకు శనివారం జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు మండల విద్యాశాఖాధికారి జె.సురేష్ బాబు శుక్రవారం తెలిపారు. నూతన విద్యా సంవత్సరం నుంచి పాఠశాల విద్యార్థులకు మెనూ ప్రకారం పరిశుభ్రమైన, నాణ్యమైన, రుచికరమైన పౌష్టికాహారం అందించాలని, మెనూ తప్పక పాటించాలని మధ్యాహ్న భోజన పథక కార్మికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి.సత్యన్నారాయణ, మండల సిఆర్‌పిలు పాల్గొన్నారు.

అత్యాచార నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మహిళలపై జరిగే హత్యలు, అత్యాచారాలపై కఠినచర్యలు తీసుకోకపోతే ఏలూరులో జరిగిన రత్న గ్రేస్ సంఘటనలే రోజురోజుకూ మరిన్ని పెరిగే అవకాశాలు ఉన్నాయని సిపిఎం జిల్లా కమిటీ తరపున ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏలూరులోని సత్రంపాడులో రత్నగ్రేస్ అనే యువతి గొంతుకోసి హత్య చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం అనేక చట్టాలు తీసుకువచ్చినా వాటి వల్ల మహిళలకు పూర్తి స్థాయిలో రక్షణ దొరకడం లేదని విమర్శించారు. మహిళలకు అన్యాయం జరిగితే తత్సారం చేయకుండా వెంటనే దోషులను కఠినంగా శిక్షించే విధంగా చట్టాల్లో మార్పులు తేవాలని ఆయన కోరారు. తల్లిదండ్రులు కూడా ఆడపిల్లలను ఒకలా, మగపిల్లలను మరోలా పెంచడం సరికాదని హితవు పలికారు. చిన్నప్పటి నుండే మగపిల్లలకు మహిళల ఎడల ఏవిధంగా ప్రవర్తించాలో తల్లి ఒడి నుంచి నేర్పాలని, అది హైస్కూలు, కాలేజీ విద్య వరకూ కొనసాగించాలని, తద్వారా కొంతవరకైనా మహిళలను చిన్నచూపు చూసే ధోరణిలో మార్పు వస్తుందని అభిప్రాయపడ్డారు. నేటి సినిమా, టివి, సెల్ ఫోన్, ఇంటర్నెట్, అశ్లీలత, హింస, మద్యం, డ్రగ్స్ వంటి అనేక అంశాల ప్రేరణతో ప్రేమోన్మాదులు చెలరేగిపోతున్నారని, తద్వారా మహిళలు పట్టపగలు కూడా తిరగలేని పరిస్థితులు దాపురించాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెండ్లి చేసుకొని అత్తవారి ఇంటికి వెళ్లాల్సిన రత్నగ్రేస్ మృత్యుఒడిలోకి చేరుకోవడం బాధాకరమని, ఆమె మృతికి ప్రగాఢ సానుభూతిని, ఆమె కుటుంబ సభ్యులకు సంతాపాన్ని ఆయన తెలియజేశారు. రత్నగ్రేస్ కుటుంబ సభ్యులను ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఓపెన్ సప్లమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ఏలూరు అర్బన్:ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్ సప్లమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కోరుతూ శుక్రవారం పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కాకినాని మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్ ఇంటర్ పేరుతో జిల్లాలో ఉన్న కొన్ని ప్రత్యేక సెంటర్ల యాజమాన్యాలు పాస్ గ్యారెంటీ పేరుతో నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేశాయని ఆరోపించారు. అయితే విద్యార్థులు కూడా పాస్ గ్యారెంటీ అని ఆశపడి యాజమాన్యాలు అడిగినట్లుగానే రూ.10 వేల నుంచి 20 వేల వరకు యాజమాన్యాలకి చెల్లించారని, కేవలం 3 వేల రూపాయలు లోపు మాత్రమే అయ్యే ఈ డిస్టెన్స్ ఇంటర్మీడియట్ విద్యకి యాజమాన్యాలు పాస్ గ్యారెంటీ అని చెప్పి కనీసం రసీదు కూడా ఇవ్వకుండా విద్యార్థుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేసి విద్యార్థులను మోసం చేశారని నాని అన్నారు. ఓపెన్ ఇంటర్ పరీక్షల ఫలితాలు విడుదలైన నేపథ్యంలో ఫెయిల్ అయిన విద్యార్థులు వెళ్లి యాజమాన్యాలని అడుగుతుంటే మాకు ఎటువంటి సంబంధం లేదు సప్లమెంటరీలో మరలా డబ్బులు కట్టుకుని రాసుకోండి అని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని తెలిపారు. శనివారం నుంచి సప్లమెంటరీ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో గత 15 రోజుల నుంచి యాజమాన్యాలు మిగిలిపోయిన సబ్జెక్టులు పాస్ అవ్వాలంటే మేము చెప్పిన డబ్బులు ఇవ్వాలని విద్యార్థులను బెదిరిస్తున్నారని, ఈ విషయాన్ని విద్యార్థులు పిడిఎస్‌యు దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ప్రయివేట్ యాజమాన్యాల చేతిలో విద్యార్థులు మోసపోకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సప్లమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కోరారు.

జిల్లా కారాగారం సందర్శన

ఏలూరు:రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఏలూరులోని జిల్లా కారాగారాన్ని శుక్రవారం పర్యవేక్షించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలకు అందుతున్న సౌకర్యాలు అనగా ఆహార పదార్థాల నాణ్యత, మంచినీటి సౌకర్యాలు, అత్యవసర పరిస్థితులు అందిస్తున్న వైద్య సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకోవడం జరిగిందని, పరిసరపరాల పరిశుభ్రత, వారికి అందుబాటులో ఉన్నటువంటి ఉచిత న్యాయ సదుపాయాలు వివరించడం జరుగుతుందని తెలియజేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
విలేకరులు కావలెను
మీరు జర్నలిస్టు కాదలచుకున్నారా?
మీకు సామాజిక స్పృహ ఉన్నదా?
విన్నదీ కన్నదీ పది మందితో పంచుకుందామనుకుంటున్నారా?
ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు ఈ క్రింది కేంద్రాల్లో ఆసక్తి గల విలేకరులు కావలెను
నూజివీడు, తాడేపల్లిగూడెం టౌన్, భీమవరం అర్బన్, కైకలూరు టౌన్
విలేకర్లు కావలసిన రూరల్ కేంద్రాలు
వేలేరుపాడు, లింగపాలెం, పెదవేగి, దెందులూరు, పెదపాడు, నిడమర్రు, గుడివాకలంక (ఏలూరు), భీమవరం, నరసాపురం, అత్తిలి, ఇరగవరం, పెంటపాడు, కైకలూరు, జంగారెడ్డిగూడెం, మొగల్తూరు
విలేకర్లకు అర్హత: ఇంటర్ ఉత్తీర్ణత, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
ఇంటర్వ్యూ : తేది: 01-06-2024 శనివారం ఉదయం 9.30 గంటల నుండి
ఆఫీసు చిరునామా: ప్రజాశక్తి కార్యాలయం, బొలుసువారి వీధి, ఏలూరు టైమ్స్ కార్యాలయం సమీపంలో, పవర్‌పేట, ఏలూరు-2
సంప్రదించాల్సిన నెంబర్లు 99493 66196, 89191 70815, 94900 99168

ఉద్యోగ విరమణతో అవధులు లేని బాధ్యతలు

ప్రజాశక్తి - ముసునూరు

ఉద్యోగ విరమణతో అవధులు లేని బాధ్యతలు ఏర్పడతాయని ఇదే దేశ సేవకు, దైవ సేవకు సదవకాశమని నూజివీడు సహాయ బిసి వెల్ఫేర్ అధికారి రవి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బిసి బాలుర హాస్టల్‌లో ముసునూరు మండల కేంద్రమైన బాలురు హాస్టల్ వార్డెన్ షేక్ నజీర్ ఉద్యోగ పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎబిసిడబ్ల్యూఒ రవి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తన ఉద్యోగ కాలంలో నిబంధనలకు లోబడి పరిమితమైన సేవలు చేయటానికి వీలు ఉంటుందని, అదేవిధంగా ఉద్యోగ బాధ్యతలతో పాటు, ఉద్యోగ విరమణ అనంతరం పలు సేవా కార్యక్రమాలు చేపట్టడానికి అవకాశం ఉంటుందన్నారు. సహ ఉద్యోగులు వారు ఇరువురు దంపతులను ఘనంగా సన్మానించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయా కార్యాలయ సిబ్బంది, పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దాహం కేకలతో ప్రజలు విలవిల..

పైపులైన్లు ధ్వంసంతో నాలుగు రోజులుగా తాగునీరందని వైనం
చర్యలు చేపట్టని పంచాయతీ అధికారులు
సమస్య పరిష్కరించాలని ప్రజల వేడుకోలు

ప్రజాశక్తి - మండవల్లి

అసలే వేసవి కాలం ఎండవేడికి గొంతెండి పోతుంది. నీరు ఎక్కువగా తాగాలనిపిస్తుంది. దీనికి తోడు తాగునీరు అందకపోతే వారి పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పక్కర్లేదు. పైపులైన్లు ధ్వంసమై గ్రామానికి తాగునీరందని పరిస్థితి నెలకొంటే అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో గ్రామస్తులు కొట్టుమిట్టాడుతున్నారు. వేసవి ఎండ వేడిమితో, ఉక్కపోతతో అల్లాడిపోతున్నామని తాగునీరందించకపోతే ఏం తాగి బతకాలని గ్రామస్తులు నిలదీస్తున్నారు.

పైపులైన్లు తెగిపోయిన ప్రాంతం..

మండవల్లి పంచాయతీలో పైపులైన్లు ధ్వంసమై గత నాలుగు రోజులుగా తాగునీరు అందడం లేదు. గ్రామస్తులు తాగునీరు లేక అల్లాడుతుంటే పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. సర్పంచి, కార్యదర్శి నిద్రపోతున్నారా అంటూ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గ్రామాల్లోని ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్వచ్ఛమైన ఆదేశాలు ఉన్నప్పటికీ దాహం కేకలతో గ్రామస్తులు అల్లాడిపోతున్నారంటే కలెక్టర్ ఆదేశాలను అధికారులు ఏవిధంగా బేఖాతరు చేస్తున్నారు అనేది తేటతెల్లమవుతుంది. దీనికి నిదర్శనమే ఈ పరిస్థితి. గ్రామస్తుల కథనం ప్రకారం మండల కేంద్రమైన మండవల్లి స్టేషన్ రోడ్‌లో డ్రెయినేజీ నిర్మిస్తూ గ్రామస్తులకు తాగునీరు అందించే పైపులైన్లను ధ్వంసం చేశారు. దీంతో తాగునీటిని కొనుగోలు చేసి దాహార్తిని తీర్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా మండవల్లి ప్రధాన సెంటర్‌లో మూడు చోట్ల పైపులు ధ్వంసమై గత 20 రోజులుగా స్వచ్ఛమైన తాగునీరు రహదారి పాలవుతున్నప్పటికీ, బిసి కాలనీకి గత నాలుగు రోజులుగా నీరందనప్పటికీ అధికారులు చర్యలు చేపట్టలేదంటే ఇక్కడి అధికారుల విధివిధానాలు ఏ స్థాయిలో ఉందో అనేది తేటతెల్లమవుతుంది. దీంతో వాడుకోవడానికి, స్నానమాచరించడానికి నీరు లేక వేసవి ఉక్కపోతతో, పిల్లాపాపలతో ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పైపులను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకొని, తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని వారు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.

వృథాగా పోతున్న నీరు..

దీనిపై కార్యదర్శి తోట శ్రీనివాసరావును వివరణ కోరగా పైపులైన్లు ధ్వంసమైన మాట వాస్తవమే అన్నారు. అందుచేత బిసి కాలనీకి గత నాలుగు రోజులుగా తాగునీరు అందించలేకపోయామని, పైపులైన్లను త్వరితగతిన పునరుద్ధరించి సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పంచాయతీ ఏం చేస్తుంది?

తానా రాజేశ్వరి

పైపులైన్లు ధ్వంసమై నాలుగు, ఐదు రోజులుగా నీళ్లు రావడం లేదు. పంచాయతీ సర్పంచి, కార్యదర్శి ఏం చేస్తున్నారో తెలియడం లేదు. మా కుటుంబంలో నలుగురు జీవిస్తున్నాం. తాగునీటి కోసం, వాడుక నీరు కోసం అల్లాడిపోతున్నాం. మా బాధ ఎవరికి చెప్పుకోవాలో, ఏం చేయాలో తెలియడం లేదు. బావిలో ఉన్న మురుగు నీటిని ఆశ్రయిస్తున్నాం.

వేరే చోటికి వెళ్లి నీళ్లు తెచ్చుకోలేకపోతున్నాం

పోతర్లంక తులసమ్మ

గత నాలుగు రోజులుగా నీళ్లు రావడం లేదు. ఏమైందని పక్కింటి వాళ్లను అడిగాను. ఏదో పని చేస్తున్నారంట, పైపులు తెంపేసారని తెలిసింది. నేను పెద్దదాన్ని వేరే చోటికి వెళ్లి నీరు తెచ్చుకోలేని పరిస్థితి. పక్కింటోళ్ల దగ్గర కొంచెం కొంచెం నీళ్లు అడిగి దాహార్తిని తీర్చుకుంటున్నాను. నీళ్లు ఎప్పటికి ఇస్తారో ఏమో అర్థం కావడం లేదు.

ఇబ్బందులన్నీ బిసి కాలనీకే

గుదే జ్ఞాన కుమారి

సమస్యలు, ఇబ్బందులన్నీ మా బిసి కాలనీకే వస్తాయి. చచ్చిపోతున్నాం ఎటువంటి సౌకర్యాలు లేక, డ్రెయినేజీ కూడా లేదు. వర్షాకాలం వస్తే రహదారి పైకి మురుగునీరు చేరి సిమెంట్ రోడ్డు మునిగిపోయి దుర్వాసన వస్తుంది. కుళాయిల ద్వారా తాగునీరు సక్రమంగా రావు. వేసవికాలం అంతకన్నా రావు. ఓట్లు వేయించుకున్న సర్పంచి గాని, పంచాయతీ కార్యదర్శి గాని ఎవరూ పట్టించుకోరు. ఇప్పుడు పైపులు తెగిపోయాయి నీరు రావడం లేదు. అధికారులు త్వరతిగతిన చర్యలు చేపట్టాలి.

ముగిసిన రత్న గ్రేస్ అంత్యక్రియలు

ఏలూరు స్పోర్ట్స్:యువకుడు యువతిని హతమార్చి ఆపై అతను కూడా ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో యువతి మృతి చెందగా యువకుడు ప్రస్తుతం విజయవాడలోని ఆస్పత్రిలో శస్త్రచికిత్స అనంతరం చికిత్స పొందుతున్నాడు. యువతి ఖనన కార్యక్రమాలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. ఏలూరు నగరంలోని ఎంఆర్‌సి కాలనీకి చెందిన రత్న గ్రేస్ స్థానికంగా తల్లిదండ్రులతో కలిసి జీవిస్తూ సత్రంపాడులో ఉన్న సిద్ధార్థ పాఠశాలలో ఫ్యాకల్టీగా పనిచేస్తుంది. ఆమెకు ఇద్దరు సోదరులు కలరు. గ్రేస్ చదువుకునే సమయంలో ముసునూరు మండలం ముసునూరు గ్రామానికి చెందిన చెల్లుబోయిన ఏసురత్నంతో పరిచయం ఏర్పడింది. వీరు ఇరువురు కలిసి ఆదిత్య కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. ప్రస్తుతం ఏసు రత్నం ఖాళీగా ఉంటున్నాడు. అయితే ఈనెల 26వ తేదీన రత్న గ్రేస్‌కు అదే సిద్ధార్థ పాఠశాలలో పనిచేస్తున్న మరో ఫ్యాకల్టీకి నిశ్చితార్థం జరిగింది. అనంతరం గ్రేస్ స్కూల్ నుంచి బయటకు వస్తున్న సమయంలో ఏసు రత్నం ఆమెతో కొంతసేపు మాట్లాడి ఆపై ఆమెపై కత్తితో దాడికి తెగబడ్డాడు. ఈ ఘటనలో గ్రేస్ ఘటన స్థలంలోనే మృతి చెందింది. అనంతరం ఏసురత్నం అదే కత్తితో మెడపై కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రస్తుతం అతను విజయవాడ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతి చెందిన గ్రేస్ మృతదేహానికి శుక్రవారం పంచనామా మూడో పట్టణ పోలీసులు పూర్తి చేశారు. అనంతరం ఆమె మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతదేహం ఏలూరు ఎంఆర్‌సి కాలనీలోని స్వగృహానికి చేరుకున్న అనంతరం బంధువుల రోదనలతో ఆ ప్రాంతమంతా హృదయ విదారకంగా మారింది. ప్రస్తుతం హత్యకు పాల్పడిన ఏసురత్నంపై మూడో పట్టణ పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇక్కడ వరకు ఈ కథ ఎలా ఉండగా సిసి టీవీలో ఉన్న సమాచారం ప్రకారం ఈ పూర్తి కథలో మరో భిన్న కథ వినబడుతుంది. ఏసురత్నం రత్న గ్రేస్‌లు ఇద్దరు గత కొన్నేళ్లుగా ప్రేమించుకుంటూ ఉన్నట్లు సమాచారం. అదే స్నేహపూర్వక భావంతో వీరిరువురు అప్పుడప్పుడు కలిసి మాట్లాడుకోవడం చేస్తూ ఉంటారని కూడా స్పష్టంగా సీసీ కెమెరా ఆధారంగా తెలుస్తుంది. ఈనెల 26వ తేదీన రత్న గ్రేస్‌కు మరో వ్యక్తికి జరిగిన నిశ్చితార్థం వేడుకకు కూడా ఏసు రత్నం వచ్చినట్లు, అదే సమయంలో తల్లిదండ్రులు మందలించినట్లు, వేరువేరు కులాలు కావడంతో ఈ పెళ్లి జరగదని, అందుకని యోగ్యుడైన వ్యక్తిని తమ కుమార్తె ఎంచుకుందని తల్లిదండ్రులు చెప్పినట్లు కూడా తెలుస్తుంది. ఈనేపథ్యంలో ఏసురత్నం ఆమెపై కత్తితో దాడి చేసినట్లు సీసీ టీవీ వివరాలు తెలియజేస్తున్నాయి. అతను హత్య చేయడానికి గల కారణాలు వెల్లడికావాల్సి ఉంది. మరో విషయం ఏమిటంటే అతను ఆత్మహత్యకు పాల్పడిన సమయంలో అతని వంటికి ఒక బ్యాగ్‌ను తగిలించుకొని ఉన్నాడు. ఆ బ్యాగులో కొత్త పట్టుచీర స్థానికంగా ఉన్న జీవి మాల్‌లో ఖరీదు చేసి, తన వెంట తెచ్చుకున్నట్లు పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో తెలిసింది. మరిన్ని వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. ప్రస్తుతం విజయవాడ ఆస్పత్రిలో అతని స్వరపేటికకు శస్త్ర చికిత్స నిర్వహించి, 48 గంటలు గడిచిన తర్వాత అతని ఆరోగ్య పరిస్థితిపై పూర్తిస్థాయి వివరాలు తెలుపుతామని వైద్యులు తెలిపినట్లు తెలుస్తుంది.

యాదవ సంఘం ఉపాధ్యక్షునిగా శ్రీనివాసరావు

ఆగిరిపల్లి :జిల్లా అఖిల భారత యాదవ సంఘం ఉపాధ్యక్షుడుగా మండల పరిధిలోని కలటూరు గ్రామానికి చెందిన పుసునూరు శ్రీనివాసరావు నియమితులైనారు. అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు చిదరబోయిన శ్రీనివాసరావు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ యాదవులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.